# THUS WE FOUGHT (అను)
# మా రెండవ యుద్ధ రుణం

ఫారెథేంజ్ ఈ రోజున సవ్యసాచి ముందుగా ప్రత్యక్షించాడు...
'ఇదేమిటీ అపసవ్యంగా' అన్న విశ్వప్రేమికుడూ నేనూ మొదటి ఎంట్రీలం..
ఈ మధ్యనే మాధవీ మనోహరుడి దర్శనం కరవై పోయింది...
దాదాపు ముప్పై రాత్రిందినాల కాలాన్ని మింగేసి మిన్నకుండి పోయాడు...
శత సహస్రార్బుదాల జీవిత కాలాలే కనుమరుగవుతున్నాయి...
అరిస్టాటిలుకు ఆహిఫేనాన్నిచ్చిన సందేశం మాకందింది..
జీవితానికి బానిసైనవాడుకదా.. గరళ సేవనం అనివార్యం...

ఈ మధ్యన మా రాజ్యాల సరిహద్దుల్లో వాళ్లనీ వీళ్లనీ పోగుచేసుకుని.. అయిదు కొండల నడుమ ప్రాంతాన్ని తన రాజ్యంగా ప్రకటించుకున్న చెంఘిజ్ ఖాన్ స్నేహ హస్తాన్ని చాచటానికి వస్తూన్న సందర్భంగా ఈ కూటమి ఏర్పాటు చేయబడింది...

మామా రాజ్య సరిహద్దులు మీకు తెల్సినా
మా దేహాల సరిహద్దులు మరిచిన వాళ్లం...
మా దేహ విస్తీర్ణం...చెప్పాలంటే ఒక్కడున్నాడు...
స్వరం నశించి...
సర్వం గ్రహించి...
కంటి చూపుతో మింటి కొలతలు చెప్పేవాడు..
దొళ్ళే చక్రాల కుర్చీలో..విశ్వ పరిభ్రమణాన్ని చూచేవాడు..
స్టీఫెన్ హాకింగ్...
టైం ట్రావెల్ అవాస్తవిక సిద్ధాంతంతో...

వెనక్కు కదిలిన భ్రమతో.. మరో అరిస్టాటిల్ (భార్యా పరంగా మాత్రమే) అయినప్పటియిన్ను కూడా రమ్మన్నాం...
అతని భవిష్యత్తు అయిన మా వర్తమానంలోకి..

ఇంతా చేస్తే..

ఉత్తి మా మా దేహాల సరిహద్దులు కొలవడానికే.. కోర్కెల వత్తిడి లోపల్నించీ పెరిగి పెరిగి విస్ఫోటించిన మా దేహాలు కాంతి వేగంతో విస్తరిస్తాయన్న రహస్యం.. వాళ్లిద్దరికీ..

ఆదిశంకరునికీ మాత్రం తెలుసు...

గౌతముడికి తెలిసినా.. తన నిశ్శబ్ద చైత్యంలో నిరామయ స్థితిలో వుంటాడు గనుక రాడు రాలేదు...

ఇంతలో విశ్వప్రేమికుడన్నాడు..

"హాకింగూ ఐన్‌స్టైనూ .. ఇద్దరూ వద్దు ఆదిశంకరుడిని పిలుద్దాం...ఆ సెల్ యిలా ఇవ్వు" అన్నాడు.

'కారణాంతరాల వల్ల మీరు చేసిన కాలు (Call) మీ జీవితాన్ని దాటి వెళ్లదు.. దయవుంచి ఇంకొన్ని జీవిత కాలాలు వేచిచూచి చేయండి' అన్న అశరీరవాణి వినిపించింది...

"ఏమిటి చేయండం?" నేను ప్రశ్నించా...

"ఆ మంచు కొండల నడుమ మిహికా పేటికలో ఆధ్యాత్మిక హైబర్నేషన్లో వున్న శంకరు డిని లేపాలి..." ఆవేశంగా అన్నాడు విశ్వప్రేమికుడు...

"భూత భవిష్యద్వర్తమానాల్ని కలుపుకు కాల భోజనం చేసే వాడా.. కాస్త నిదానించు" అన్నాడు సవ్యసాచి...

"లేదు లేదు అద్వైత తత్త్వవేత్త ఆ ఆదిశంకరుడి అవసరం ఇప్పుడుంది..చెంఘిజ్ వచ్చే లోపల చేయాలి ఫోను" అన్నాడు విశ్వప్రేమికుడు...

"చెంఘిజ్‌కూ శంకరుడికీ ఏమిటి లింకు?" అడిగా...

"నానా తత్త్వ విచారణ యిక్కడే ఈ తోటలో ముగిసిపోయి మనం బయటపడే లోపు అందరం ఒక్క మాటగా వెళ్లాలి" స్పష్టంగా అన్నాడు విశ్వప్రేమికుడు...

ఇంతలో మెయిన్ గేటు అటు వేపు నించీ "భవతీ భిక్షాందేహి" అని వినిపించింది...

"ఎవరది?" ప్రశ్నించా నేను....

"కూమారా నేను కృష్ణద్వైపాయనుడ" జవాబు...

"చేయి ఖాళీగా లేదు... వెళ్లిరండి...అందునా ఇది కాశీ కాదు"

"కొన్ని వందల ఏళ్లుగా స్వచ్ఛమైన అక్షరం దొరక్క అలమటిస్తున్నాను. వేదాలను విభజించిన పాపమేమో నాకు తెలియదు.. కనికర రహితంగా కన్నతల్లి అచ్ఛోదకు ఆత్మతృప్తిని ఇవ్వలేక తల్లడిల్లుతున్న వాడిని... కాసిని అక్షరాలు ఈ జోలెలో వేయండి"

"మునీంద్రా కాలగమనం తెల్సినవారు నా జీవిత కాలానికి రండి.. దండిగా అక్షర సేవనం చేయొచ్చు" కాళిదాసు గొంతు దిగంతాల నించి పలికింది...

"కుమారా కాళిదాసా! అక్షరక్షుత్తన నీ కెరుకలేదా?" దీనంగా వ్యాసుడడిగాడు...

"ఎందుకు తెలియదు మునీంద్రా..ఎప్పుడూ నాశనం లేనిది ఒక్క 'ఆకలి' మాత్రమే అని కదా" అని వ్యంగ్యంగా మారు జవాబు వినిపించింది...

శ్వాస కుంభించి..

నాభి నించి వైశ్వానరోద్భవం కావించి..

తపించి..

జ్వలించి...

అండ్ దెన్ హి టుక్దఫాం ఆఫ్ ప్లాస్మా... అండ్ ట్రావెల్డ్ అటె స్పీడ్ గ్రేటర్ ద్యాన్ లైట్...

అతని వెనుకో తటిత్తు వెంబడిస్తూ వెళ్ళింది..

అక్షర లోకాలకు..

* * *

"లైసర్జిక్ యాసిడ్ డైయి ధైలమైడ్....కన్నా కిక్కు ఏదిస్తుందీ?" బాడబక్షీర సారా గ్రోలిన చెంఘిజ్ అడిగాడు..

ఓ పోక్ తర్వాత.. జమిలి కిక్కుతో...

"యుద్ధం" జవాబు చెప్పా నేను...

"ఆ సంగతి నా ఆరేళ్ల కొడుకు ఆగద్దైకి కూడా తెల్సులే.. చీనాను చించేసినా.. యూరోపును సాపు చేసినా.. ద్రాక్షా సవం బావున్నా.. దీన్ని మించిన కిక్కు (యుద్ధం మినహా) నాకు కావాలి..." చెంఘిజ్ గొర్రె తలలోంచీ దాని కనుగుడ్డును పెకలించి స్నేహపూర్వకంగా మా వేపు చాచాడు..

శిరోరహితమై స్నాయురహతమై ఆ పశు నేత్రం మా వేపు చూచిన చూపులో ఎన్ని నాగరికతలో!

దాన్ని మింగేస్తే అది చూచిన దృశ్యాలన్నీ మా గర్భాన చేరుతాయా?

కాంతిచ్ఛటల్ మాయమై మరుక్షణమున ప్రత్యక్షమై...

అప్పుడెప్పుడో ఓ నలభై అయిదేళ్ల క్రిందట...

నేను లతా ఆడుకున్నాట మరిచిపోగలనా...

క్షణ మాత్రాన కళ్లు మూసుకు స్మరిస్తే ప్రత్యక్షం...

జ్ఞాపకం, గర్తుతెచ్చుకోడం... గుర్తుంచుకోడం...అన్నీ కరెంటు వ్యవహారాలే...

ఫిజియాలజీ ప్రొఫెసర్ రామచంద్రుడు...

రేడియో రిపేర్ చేస్తూ...

Every physical action is an electrical impulse..

* * *

అప్పటికి అందరం దాదాపు సమకూడాం...

మాధవీ మనోహరుడు మడికట్టుకు వచ్చాడు..

అరిస్టాటిలు సంగతి ముందే చెప్పాను.. అతనికి ఆహిఫేన చషక మందివ్వబడింది.. జీవితానికి బానిసైన నేరానికి ఈ గుంపున కొత్త గొంతుక ఒక చెంఘిజ్ దే... వాడి తరపున చాలా మంది.

అనాహూతులుగా వచ్చిన వాళ్లున్నారు...

అందులోంచీ ఓ వ్యక్తి లేచాడు...

"మీ ఊరూ పేరూ చెప్పి మీరు మాట్లాడండి" లేట్‌గా వచ్చిన దీర్ఘపాదుడన్నాడు...

" నాపేరు..'మొరగాగ్జినీ జియావోనీ బతిస్తా' నేను చెప్పదల్చుకున్న దేమిటంటే.. మీ మెదళ్లూ మీ దేహాలూ మొత్తం..స్వార్థం అన్న క్రిములతో రోగభూయిష్టమై లుకలుక లాడుతున్నయ్.. నేనింకా..."

"చాలు చాలు కూచో మా మా రోగాలు మాకు తెలుసు" దీర్ఘపాదు దతడ్ని కూచోబెట్టినట్టు తొక్కేసాడు..

బయోకెమిస్ట్రీ బాగా తెల్సినవాడు దీర్ఘపాదుడు.

అతని ముందు వరసలో కూచున్న వ్యక్తి రాజసంతో లేచి నిలబడ్డాడు.. ఎవ్వరూ అడక్కుండానే...

"నా పేరు నేనుచ్చరించను..ఓ బానిసా నేనెవరో లోకానికి విదిత పరచు" అన్నాడు..

ఆ బానిస లేచి.. అతి వినమ్రంగా... "ఓ మహాజనులారా... మనలందరినీ కరుణించి మనకు ప్రసంగ ప్రధానం చేయువారు మన అన్నదాత మాన్యశ్రీ శ్రీ శ్రీ ఖుఫూ గారు.. వారి వల్లనే నేటికీ ఈజిప్టు నాగరికత ఓ రహస్యంగా మిగిలి వున్నది...తతిమ్మాది మా అన్నదాత చక్రవర్తి వారి స్వర్ణ భాషణంలో తెలుస్తుంది" అని వంగి వంగి చెప్పాడు...

ఇంతలో ఓ బలిష్ఠాకారం లేచి నిలబడింది...

"నేను స్పార్టకస్‌ను..ఈ ఖుఫూ దుర్మార్గునికి దాదాపు మూడు వేల సంవత్సరాల తర్వాత పుట్టినందువలన వీడు నా చేతిలో బతికిపోయాడు..."

ఇంతలో ఇంకో వ్యక్తి లేచి..

"ఇతిహాసపు చీకటి కోణం

అట్టడుగున పడి కనిపించని కథలన్నీ..."

అని సిగరెట్టు దమ్ము కోసం ఆగాడు...

ఆ వెనకనించీ యింకో శాల్తీ లేచి నిలబడి, "ఆగాగు.. నా పేరు నార్ల... నరాలు తీస్తా.. నువ్వూ, గురజాడా యిద్దరి జాడా వక్కటే.. ఇందిరాగాంధీ మీద కవిత్వం రాసుకో కాసు లొస్తయ్... నువ్వు రాసే రాతలూ, నువ్వరిచే అరుపులూ అన్నీ అరువు తెచ్చుకున్నవే...బ్రెక్ట్ వాక్యాల్ని యధాతధం దొంగిలించిన వాడివి" అనర్చాడు...

"ఆగండాగండి ఇది మా వ్యక్తిగత యుద్ధ రంగం...

మీమీ చెలగాటాలిక్కడ కాదు..."

అంటూ ఓ పెద్ద సైజు పోస్టరు తెచ్చి మామిడి కాండానికి తగిలించాడు..సవ్యసాచి

ఆ పోస్టరులో ఓ ముఖం...

ఆ ముఖం కూడా ఒకే వ్యక్తిది కాదు..

రకరకాల ముఖశకలాలు తెచ్చి కూర్చిన ముఖచిత్రం.

ఆ చీకటిలో స్పష్టంగా కనిపించడంలేదు...

విశ్వప్రేమికుడో అరణి తెచ్చి రాపాడించి అగ్ని పుట్టించి మంట వేసాడు...

ఆ మంట వెలుగులో ఆ పోస్టరు బాగా కనబడసాగింది... సవ్యసాచి గొంతు సవరించు కుని..

"మిత్రులు కాగోరు శత్రువులకూ... శత్రువులుగా మారివున్న మిత్రులకూ ఇది హెచ్చరిక...

ఈ బొమ్మ ఓ దౌర్జన్యకారుడిది.... వీడు కడు దుర్మార్గుడూ అతి భయంకరుడూ...

కవిత, కథ, నవల, వ్యాసం, సమీక్ష లాంటి మారణాయధాలు కలిగి..అమాయకుడిలా సంచరిస్తూంటాడు...

తాగుబోతు వలె నటిస్తూ మనం మాట్లాడే మాటల్ని బహు జాగరూకుడై రికార్డు చేసుకుని తన రచనల్లో వాడుకుంటుంటాడు.

బవిరి గడ్డంతో...లాల్చీ పైజామాల్లో పిచ్చివాడిలా కనిపిస్తాడు...

నిత్య విద్యార్థి అనే నకిలీ అయిడెంటిటీ కార్డు చూపెడుతూ మోసాలు చేస్తూంటాడు..

కనుక యిక్కడకు దయచేసిన అనాహూతులలో సాహితీ ప్రియులున్న ఎడల..మీరందరూ సమైక్యంగా.. పోరాడి వీడిని నాశనం చేయవలసి వున్నది..."

ఇంకో హెచ్చరిక ఏమిటంటే నేనిది మాట్లాడ్తూన్నంత సేపూ వాడిక్కడెక్కడో పొంచి వుంటాడు.. వాడు మీ పక్కనే వుండొచ్చు బహుపరాక్".

ఒక్కసారిగా అనాహూతుల మంద చాలా మటుకు మటుమాయమైంది

కొందరు కాలాతీత వ్యక్తులు మాత్రం మిగిలారు...

"చూసావా వీళ్లందర్నీ వదిలించుకోడానికి నిన్ను ఓ మిసైల్‌గా వాడాను - గొప్పగా పేలావు నువ్వు..." అని నవ్వుతూ నా భుజం చరిచాడు సవ్యసాచి...

* * *

మాధవీ మనోహరుడు మూడో కోక్ తెరిచాడు తల తెగిన స్వర్ణ జల కలశంతో...

చషకాలతో...

మా మా వైయక్తిక జీవన సమస్యల మీద సమష్టి యుద్ధం ప్రారంభించాం...

స్నేహ హస్తం చాచి వచ్చిన చెంఘిజ్ అనుమాన నివృత్తి కోసం నన్ను నిలువునా శోధించి... సవ్యసాచి వర్ణించినది నన్నేనని రూఢి చేసుకుని-

"ఇన్ని భయంకరాయుధాలున్న వాడితో మిత్రత్వమెట్లా సంభవం!?" అడిగాడు.

మాధనీ మనోహరుడు నా భుజమ్మీద శిలాసదృశ హస్తాన్ని వేసి అన్నాడు-

"చెంఘిజ్ ! నిన్ను నువ్వు జయించుకున్న తర్వాత నిన్నెవరూ జయించలేరు.. అచ్యుతుని చూడు సర్వాన్నీ ప్రోదిచేసి యిచ్చినా కించిచ్చలనం లేకుండా వుంటాడు. నీ నీడను నువ్వను మానించడం మాని మా సమష్టి యుద్ధంలో చేయి కలుపు... ఈ యుద్ధం మనం ప్రపంచాన్ని గెలవడానికి కాదు.. తాత్కాలికంగానైనా మన మన సాంఘిక అస్తిత్వాల మీద మనదే అయిన గెలుపు కోసం"

మళ్లీ ఫెళ్లున విచ్చిన ప్రాదిని..

క్షణకాల కాంతిలో మేము...